పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు పేరుకు పోయినందున శనివారం నుంచి నాల్గవ తేదీ వరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని జైనూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈర్ఫాన్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

పాము కాటుతో ఆవు మృతి

లింగాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాముల్‌ధర గ్రాయ పంచాయతి పరిధిలోని గూటాగూడ గ్రామానికి చెందిన పర్చకి రాము అనే రైతుకు చెందిన ఆవు గురువారం పాము కాటుతో మృతి చెందింది. ఆవును రోజు మాదిరిగానే ఇంటి సమీపంలో గురువారం రాత్రి కట్టి ఉంచాడు. శుక్రవారం ఉదయం చూడగా ఆవు మృతి చెంది ఉంది. ఆవు విలువ సుమారు 40 వేల రూపాయలు ఉంటుందని ప్రభుత్వ ఆదుకోవాలని కోరాడు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

సిర్పూర్(యు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నెహ్రూ కేంద్రం ఆదిలాబాద్ వారి సహకారంతో నిర్వహించిన వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి ఆసరా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విజే తలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా చండీ సప్తశతి మహాయాగం

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 31: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నది తీరాన గల బాలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4న నిర్వహించే రథోత్సవాన్ని పురస్కరించుకుని నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయ అర్చకుడు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో చండీసప్తశతి మహాయాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి అభిషేకం, రాజోపచారములు, మంగళహారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్ర మం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు విజయ్ కుమార్ శర్మ, అజయ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఇర్ఫాన్‌నగర్ కాలనీలో సర్వేనెంబరు 144లో ఉన్న మూడు ప్లాట్లకు సంబంధించిన భూమి విషయంలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఫరీజ్ అంజుమ్ అనే మహిళ శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వే నంబరు 144లోని మూడు ప్లాట్లు 02-07-1978లో ఇర్ఫాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇమాం వద్ద ఆమె అత్తగారు కొనుగోలు చేసినట్టు వివరించారు. వీటి ఆధారాలు ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం మహ్మద్ ఇమాం కొడుకు అజీం, ఇతరులు కలిసి ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు వాపో యింది. ఈ విషయంలో పట్టణ సీఐ, డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతుల పరిస్థితి నానాటికి దిగజారిపోతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కౌలు రైతుకు భరోసా లేకుండా పోయింది. ఈ సీజన్ నుంచి రైతులకు రైతు భరోసా, కూలీ లకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేస్తూ కౌలు రైతుల గురించి ప్రభుత్వం ఊసెత్తక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

కౌలు రైతుకు దక్కని భరోసా

- పెట్టుబడి సాయం ఊసెత్తని ప్రభుత్వం
- ఆరుగాలం శ్రమించినా దక్కని ఫలాలు
- అడ్డగోలుగా పెరిగిన కౌలు ధరలు, పెట్టుబడులు
- జిల్లాలో సుమారు 20వేల మంది కౌలు రైతులు

చింతలమానేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి కౌలు రైతులు మళ్లీ దూరమవుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకానికి కూడా నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం కౌలు రైతులకు అందేలా లేదు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను చేపట్టి సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను సేకరించారు. దీని ఆధారం గానే గ్రామసభలు ఏర్పాటు చేసి అనర్హుల జాబితాను వెల్లడించారు. కానీ ఎక్కడా కౌలు రైతుల ఊసెత్తినట్టు కనిపించలేదు.

మళ్లీ భూమిని కలిగి ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో కౌలు రైతులు దిక్కుదోచని స్థితిలో పడుతున్నారు. గతంలోనే కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందజేయాలని డిమాండ్ వచ్చింది. దీంతో ప్రభుత్వం కూడా పరిశీలిస్తామని చెప్పింది. అయినా పెట్టుబడి సాయంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆందోళనకు గురవతున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీల్లో సుమారుగా 20వేలపైనే కౌలు రైతులు ఉన్నారు. భూమి లేదన్న కారణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందని చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది.

కానీ కౌలు రైతుల ఊసెత్తకపోవడంతో రైతులు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తులు చేసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూసమగ్ర సర్వే లోనూ కౌలు రైతులకు అవకాశం దక్కలేదు. ఎలాంటి భూమి లేని రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించింది. కానీ కౌలు రైతులకు భరోసా అందడం కష్టంగానే ఉందని చెబుతున్నారు. ఎందుకంటే గ్రామాల్లో ఎకరం..ఆ లోపు భూమిని కలిగి ఉన్న రైతులే ఎక్కువగా సాగు చేస్తున్నారు. కాగా గుంట భూమిని కల్గి ఉన్నా వారికి ఆత్మీయ భరోసా వర్తించదని అధికారులు చెబుతున్నారు. దీంతో దాదాపుగా ఈ పథకానికి కూడా కౌలు రైతులు అర్హుల య్యేలా కన్పించడం లేదు. ఎలాంటి ఆధారం లేని రైతు కూలీలకు మాత్రమే ఆత్మీయ భరోసా అందే విధంగా చర్యలు చేపడుతున్నారు.

పంట కోల్పోయినా..

భూములను కౌలుకు తీసుకొని పంటలను సాగు ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, తెగుళ్ల వచ్చి పంటలు దెబ్బతిన్నా పట్టాదారులకు కౌలు చెల్లించాల్సిందే. ఎకరాకు ఒక పంటకు 10-15 వేల రూపాయల వరకు కౌలు చెల్లిస్తున్నారు. జిల్లాలో కొన్ని చొట్ల ముందుగానే కౌలు సొమ్ము చెల్లించిన వారికే పట్టాదారులు భూములను కౌలుకు ఇస్తున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలతో పాటు ట్రాక్టర్లతో దున్నడం, హార్వేస్టర్ కిరాయి, కలుపు తీత, వరినాట్లు వేసేందుకు కూలీ ధరలు పెరగడంతో పెట్టుబడులు అధికమయ్యాయి. పంట నష్టపోతే ప్రభుత్వం ఇచ్చే పరిహారం పట్టాదారులకే ఇస్తారు. బ్యాంకు లో పంట రుణాలు, ఇతరత్రా సబ్సిడీ పథకాలు వారికే వర్తింపజేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పని చేసి పంట తీసినా తమకు చెమట చుక్క లు తప్ప ఏమీ మిగలడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. అప్పుల పాలై పలువురు ఆత్మహత్యలు చేసు కున్న సందర్భాలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు తమకు కూడా ఇదే సీజన్ నుంచి రైతు భరోసా అందజేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి..

సంతోష్ చౌదరి, రైతు, చింతలమానేపల్లి

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. కౌలు రైతులకు రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకం వర్తించడం లేదు. రైతుల కోసం ప్రత్యేక చట్టాలను తీసుకు వచ్చి కౌలు రైతులు సాగు చేసే భూములకు పంట పెట్టుబడి ఇవ్వాలి. బ్యాంకులో రుణాలు పొందే విధంగా ప్రభుత్వం నిబంధనలు అమలు చేస్తే బాగుంటుంది.



కన్నుల పండువగా వేంకటేశ్వర కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కెరమెరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం టీటీడీ నుంచి వచ్చిన గొల్లపల్లి సత్యానారాయణ, సంతోష్‌కుమార్ బృందం ప్రత్యేక పూజలు, స్వామి వారికి అలంకరణ, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకు ముందు టీటీవీ దేవస్థానం నుంచి స్వామి వారికి అధికారులు పట్టువస్త్రాలు తీసుకు వచ్చి సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను టీటీడీ దేస్థానం ఆలయ కమిటీ అర్చకులు ఘనంగా సన్మానించారు. కాగా జాతర సందర్భంగా అనార్‌పల్లి గ్రామంలో ప్రధాన వీధుల్లో రథోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవాం ం ప్రారంభమైన జాతర మూడు రోజుల పాటు కొనసాగనుంది. మండలంతో పాటు ఆసిఫాబాద్, జైనూరు, నార్నూర్, సిర్పూర్(యూ), ఉట్నూర్‌తో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, కిష్టునాయక్, శంకర్‌నాయ్, శేషరావు, లాల్‌సింగ్, రాందాస్, తిరుపతి, వెంకట్‌రాం, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వెదురు వస్తువుల తయారీతో ఆర్థిక అభివృద్ధి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి


ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 31: వెదురు వస్తువల తయారీలో సంఘాల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న వెదురు ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లా డుతూ వెదురుతో వినూత్న వస్తువులు తయారు చేసే ప్రణాళిక రూపొందించాలన్నారు. యూనిట్ పూర్తి చేసే లోపు అవసరమైన వెదురు నిలువల సేకరణకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నాణ్యమైన పరికాలను ఉపయోగించాలని, పరికాల వినియో గంలో భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీపీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాటంతా పూదోట



వాంకిడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిపాబాద్ జిల్లాలోని 363వ నంబరు జాతీయ రహదారిపై పూల మొక్కలు వాహనదారులకు ఆహ్లాదం పంచుతున్నాయి. రహదారిపై డివైడర్ల మధ్యలో వివిధ రకాల పూల మొక్కలు పెట్టారు. ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది మొక్కలకు నిత్యం నీరు పట్టి సంరక్షించడంతో ప్రస్తుతం పూలు పూశాయి. వాంకిడి మండలం నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్లే రహదారి మధ్యలో పూసిన పూలు వాహనదారులకు కనువిందు చేస్తున్నాయి. బైక్‌లు, కార్లల్లో వెళ్లే ప్రయాణికులు కొంత సమయం అక్కడ సేద తీరుతున్నారు.

నేనొచ్చా పగటి పూట



సిర్పూర్(టి), జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెంపల్లి బ్రిడ్జి వద్ద తెల్లని గుడ్లగూబ పగటి పూట కనిపించింది. కాగజ్‌నగర్- సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై గుడ్లగూబ కనిపించడంతో అటుగా వెళ్తున వారు ఆసక్తిగా తిలకించారు. సెల్‌ఫోన్లలో బంధించారు. దీనిపై ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్‌ను వివరణ కోరగా బార్న్ గుడ్లగూబకు శాస్త్రీయ నామం టైటో అల్బాగా ఇటాలియన్ వైద్యుడు, ప్రకృతి శాస్త్రవేత్త స్కోపోలి 1769లో పేరు పెట్టారని చెప్పారు. టైటో అల్బా అంటే తెల్ల గుడ్లగూబ అని అర్థమని వివరించారు.

గురుకుల పాఠశాలలో గ్యాస్ లీక్



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని జ్యోతిబాఫూలే బాలుర గురుకుల పాఠశాలలో గ్యాస్ లీకేజీ ఏర్పడి మంటలు లేచాయి. గమనించిన విద్యార్థులు బయటకు వచ్చారు. సిబ్బంది అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే గదిలో ఉన్న తలుపు, వైరింగ్ అంతా కాలింది.ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం విషయాలను అడిగి తెలుసుకున్నారు. నష్టం జరుగపోవటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అధికారులు విచారణ చేపట్టాలి

కాగజ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతిబాఫూలే బాలుర గురుకుల పాఠశాలలో గ్యాస్ లీకేజీపై అధికారులు విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయికృష్ణ శుక్రవరాం ఒక ప్రకటనలో కోరారు. కాలం చెల్లిన గ్యాస్ పొయ్యికి సంబంధించిన పైపులు వాడటంతో ఈ సంఘటన జరిగినట్టు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతిబాఫూలే బాలుర గురుకుల పాఠశాలలో గ్యాస్ లీకేజీపై అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఓయూ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నం నాగర్జున తెలిపారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాలికల సంరక్షణకు పాటుపడాలి

కెరమెరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు పాటుపడాలని మహిళా సాధికారత జిల్లా కో ఆర్డినేటర్ శారద అన్నారు. బేటీ బచావో-బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కెరమెరి మండలం మోడి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా రవాణాధికారి రాంచందర్ నాయక్

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా రవాణాధికారి రాంచందర్ నాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, సబ్ ఇన్స్‌పెక్టర్ ప్రశాంత్, రాజేశ్వర్‌లతో కలిసి ఆటో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించామన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుకు వెళ్లకూడదని చెప్పారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించాలని సూచించారు. ముఖ్యంగాహెల్మెట్ లేకుండా బైక్‌లను నడపకూడదన్నారు. కారులో సీటు బెల్టును వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలను నడప కూడదని చెప్పారు. కార్యక్రమం ఏఎంవీఐ విక్రం పాల్గొన్నారు.

● ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆసిఫాబాద్ డిపోలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి రామచంద్ర, డీఎం విశ్వనాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవింగ్ అనేది చాలా క్లిష్టమైన పని అన్నారు. ఆర్టీసీలో ప్రమాదాల రేటు చాలా తక్కువగా ఉందని, దీనిని ఇలాగే కొనసాగించాలని డ్రైవర్లకు సూచించారు. . అనంతరం 30 సంవత్సరాలుగా ప్రమాద రహిత డ్రైవింగ్ చేసిన డ్రైవర్లు అన్వర్‌ఖాన్, కుత్బోద్దీన్, జమీల్‌ఖాన్‌లకు ప్రశంసా పత్రం అందజేశారు.

గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలలో నాక్ టీం విజిట్ ఉన్నందున రికార్డులను సిద్ధంగా ఉంచాలని స చించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శారద తదితరులు ఉన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కోట్నాక భీంరావు స్మారక పార్కులో శుక్రవారం సమతా భారత్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమకారుడు గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు దినకర్, ఆత్మారాం, రహెమాన్, ప్రవీణ్ కుమార్, ఇర్ఫాన్, టీకానాంద్, కార్తీక్, రాజేందర్, వినోద్, అశోక్, శ్రావణి, భీంరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో కృష్ణవేణి పాఠశాలలో జిల్లా నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి సంధ్య, ఇర్ఫాన్, మేడికార్తిక్, డొంగ్రీ సంతోష్, దుర్గం సమ్మక్క, సీనియర్ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో గద్దర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్, నాయకులు విజయ్, విలాస్, రాజేంద్రప్రసాద్, సందీప్, నారాయణ, ప్రశాంత్, రోషన్, శ్యాంరావు, నాగసేన్, వివేక్, అరుణ్, ఇంద్రజిత్, ప్రతాప్, మనోజ్ పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● కౌటాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ బలపరుస్తు వంగ మహేందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలో ఉపాధ్యాయుల ఇళ్లలో ప్రచారం నిర్వహించారు.

● తిర్యాణి: బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటు న్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అనీల్‌గౌడ్ అన్నారు. స్థానికంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

● ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

- ట్రాన్స్‌జెండర్లు గుర్తింపు కార్డు, కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖాధికారి బాస్కర్ అన్నారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు జీవనోపాధి కింద వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు.

- ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. పోలీసు కార్యాలయంలో పదవి విరమణ పొందిన ఎస్సై సుధాకర్‌కు వీడ్కోలు పలికారు

● వాంకిడి: వాంకిడి ప్రభుత్వ వైద్యశాలలో ఎంఎన్‌వోగా పనిచేసి పదవీ విరమణ పొందిన వాంకిడి మండల కేంద్రానికి చెందిన పిప్పిరి ఊశయ్యను మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ సన్మానించారు.

● లింగాపూర్: లింగాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాంచందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇన్‌చార్జిగా ఉన్నా కిరణ్‌రావు స్థానంలో రాంచంద్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఇంటర్వ్యూ....

కాండం తులసి పురుగు సోకకుండా చూసుకోవాలి

● దిలీప్‌కుమార్, రెబ్బెన ఏవో



ఆంధ్రజ్యోతి: యాసంగిలో వరి పంటకు కాండం తులసి పురుగు రాకుండా రైతులు తీసుకోవల్సిన చర్యలు ఏంటి?

ఏవో: ప్రస్తుతం చలి ఉన్నందున యాసంగిలో వరికి కాండం తొలుచు పురుగు వచ్చే అవకాశం ఉంటుంది. దాని నివారణకు నీటిని వదిలేసి పురుగుల మందు పిచికారి చేస్తే ప్రయోజనం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో వ్యవసాయానికి అనుకూలమైన భూమి ఎంత ఉంది?

ఏవో: రెబ్బెన మండలంలో ప్రస్తుతం వ్యవసాయానికి అనుకూలమైన భూమి 36వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పంటల సాగు వివరాలను సిబ్బంది సేకరించారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో రైతు బంధుకు ఆమోదయోగ్యం కాని భూమి ఎంత ఉన్నట్లు గుర్తించారు?

ఏవో: ఇప్పటి వరకు 250 ఎకరాలు వరకు రైతు బంధుకు ఆమోదయోగ్యం కాని భూమిగా గుర్తించాం. మండలంలో ప్రస్తుతం పాసిగాం గ్రామంలో సర్వే పూర్తయింది.

- రెబ్బెన, (ఆంధ్రజ్యోతి)

అర్ధాకలి చదువులకు స్వస్తి

- పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం
- నేటి నుంచి మార్చి 20 వరకు కొనసాగింపు
- 21 నుంచి వార్షిక పరీక్షలు

బెజ్జూరు/వాంకిడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అర్ధాకలితో అలమటిస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయం ఊరట కలిగించింది. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న వారికి సాయంత్రం పూట స్నాక్స్ అందించాలని నిర్ణయించింది. శనివారం నుంచి కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తగరతుల నేపథ్యంలో అల్పాహారం కోసం నిధులు మంజూరు చేసింది. పరీక్షల్లో మంచి ఫలితాల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు విద్యార్థుల ఆకలి కష్టాలకు తెరపడింది. ఈ మేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఫిబ్రవరి 1నుంచి మార్చి 20వరకు విద్యార్థులకు అల్పాహారం అందనుంది. ఒక్కో విద్యార్థికి రూ.15చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది. మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

● ఉత్తమ ఫలితాల సాధనకు..

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖ అధికారులు గతేడాది నవంబరులో ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఉదయమే ఇంటి నుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనం తరువాత సాయంత్రం వరకు బడిలోనే ఉండాల్సి రావడంతో ఆకలితో అలమటిస్తున్నారు. దీంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. అర్ధాకలితో చదువులకు ఆటంకం ఏర్పడుతుండటంతో ఉత్తీర్ణతపై ప్రభావం చూపనుందని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విద్యార్థులు ఆకలి బాదలు తప్పడంతో పాటు చదువుపై దృష్టి సారించి ఫలితాలు మెరుగు పడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించింది.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 50ఉన్నత పాఠశాలల్లో ఫిబ్రవరి 1నుంచి మార్చి 20వరకు సాయంత్రం వేళ స్నాక్స్ అందించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పదో తరగతిలో 2,168మంది విద్యార్థులు ఉన్నారు.

ఎల్కపల్లి నుంచి రాక..

- మేస్రం నరేష్, ఎల్కపల్లి



ఎల్కపల్లి నుంచి బెజ్జూరు ఉన్నత పాఠశాలకు సుమారు 2కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి చదువుకుంటున్నా. అల్పాహారం లేక సాయంత్రం నీరసంగా ఉంటుంది. ప్రభుత్వం స్నాక్స్ ఇవ్వనుండడంతో ఉపశమనం కలుగనుంది. దీంతో చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంది.

విద్యార్థులకు ప్రయోజనం..

- వడ్లూరి రాజేష్, ఉపాధ్యాయుడు



పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీతో ప్రయోజనం కలుగనుంది. చాలా మంది విద్యార్థులు దూరం ప్రాంతం నుంచి వస్తారు. ప్రత్యేక తరగతులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లే సరికి ఆలస్యమవుతుంది. నీరసంగా ఇంటికి వెళ్లి మళ్లీ చదవలేరు. స్నాక్స్‌తో ఆ పరిస్థితిని అధిగమించవచ్చు.

విద్యుదాఘాతంతో లారీ క్లీనర్ మృతి

మంచిర్యాల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులో నిర్మిస్తున్న వైకుంఠధామం వద్ద మట్టి అన్‌లోడ్ చేస్తుండగా టిప్పర్‌కు విద్యుత్ తీగలు తగిలి క్లీనర్ కోట సాయి(25) షాక్‌కు గురై మృతి చెందినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మాదారం 5ఇంక్లైన్‌కు చెందిన కోట సాయి చక్రపాణి వద్ద లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం వైకుంఠధామంలో టిప్పర్‌తో మట్టిని అన్‌లోడ్ చేసేందుకు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా జాకీ లేపడంతో పైన కరెంటు తీగలకు తగిలింది. దీంతో లారీ వెనుక ఉన్న కోట సాయి లారీని పట్టుకొని ఉండడం వల్ల విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్పృహ తప్పి కింద పడిపోవడంతో అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సాయి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కోట నాగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

● ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



రాజేశ్వరి (ఫైల్)

మంచిర్యాల క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆమె తరుపు బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండ లం కన్నెపల్లికి చెందిన ముత్తెం రాజేశ్వరి (55) గుండె సమస్యతో గురువారం మంచిర్యాల పట్టణం బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు గుండెకు రెండు స్టంట్‌లు వేసి చికిత్స అందించే క్రమంలో శుక్రవారం మృతి చెందింది. అయితే డబ్బులు కట్టకపోవడంతో స్టంట్ వేయ కుండా ఆసు పత్రి యాజమాన్యం గంట పాటు వైద్యం ఆపారని బాధితులు ఆరోపి స్తూ వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోగి తరు పు బంధువులతో మాట్లాడి ఆందోళన విరమించేలా చేశారు. రోగిని పరీక్షించిన అనం తరం కుటుంబ సభ్యులకు డెత్ రిస్క్‌పై కౌన్సిలింగ్ నిర్వహించి వారి అంగీకారంతోనే స్టంట్స్ వేసి చికిత్స అందించే క్రమంలో మృతి చెందిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్ష

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పీజీటీసీ గురుకుల పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాన్ని పీటీజీ గురుకుల సెంటర్ ప్రిన్సిపాల్ భద్రతయ్యతో కలిసి పరిశీలకుడు సంతోష్ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 48 కేంద్రాలు ఉండగా 4507 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4445 మంది హాజరై 362 మంది గైర్హాజరు అయినట్లు ఇంటర్మీడియట్ అధికారిణి కళ్యాణి తెలిపారు.



ఆసిఫాబాద్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఉద్యోగుల కృషి అభినందనీయం



వెంకటేశంను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి అభివృద్ధికి ఉద్యోగుల కృషి అభినందనీయమని ఇన్‌చార్జి ఎస్ఓ టు జీఎం శ్రీధర్ రావు అన్నారు. ఏరియా సర్వే అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఎం. వెంకటేశంను జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వెంకటేశం తన సర్వీస్ కాలంలో ఉత్తమ సేవలందించాలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు కె. కిరణ్ కుమార్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు చిరంజీవులు, ఆనంద్ కుమార్, రాజేశ్వర్, పర్సేజ్ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులను ఆర్‌కే 6 గనిపై మేనేజర్ ఈ. తిరుపతి సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారిని, కోల్ ఇండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానించారు.

కోల్ ఇండియా క్యారమ్స్ పోటీలకు ఎంపిక

శ్రీరాంపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో వచ్చే నెల నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే ఆల్ ఇండియా కోల్ ఫీల్డ్ క్యారమ్స్ పోటీలకు శ్రీరాంపూర్‌కు చెందిన ఇద్దరు సింగరేణి క్రీడాకారులు ఎంపికయ్యారు. శ్రీరాంపూర్ ఓసీపీకి చెందిన ఆఫీస్ అటెండెంట్ తాజుద్దీన్, ఆర్‌కే 6కు చెందిన సృజన్‌రావు ఎంపికయ్యారు.

డోర్లి2 ఓసీని సందర్శించిన ప్రొఫెసర్

రెబ్బెన, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని డోర్లి ఓసీ 2 గనిని వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మూతబడిన గని, ఇతర పరిసరాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంర్భంగా సింగరేణి జీఎం శ్రీనివాస్, సిబ్బంది ప్రొఫెసర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, అదనపు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాల చెల్లించాలి

రెబ్బెన, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ తెలిపారు. శుక్రవారం జీఎం శ్రీనివాస్‌కు సమ్మె నోటీసును అందజేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరిం చాలని కోరారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

మందమర్రిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ లెవల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వహకులు నజీర్‌సౌండ్స్, అంజనిపుత్ర ఎస్టేట్ నిర్వహకులు గుల్షన్, శ్రీను, ప్రసాద్, చంటి, బబ్బి, శ్రీకాంత్, శశి, సాయి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



నాగోబా ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న మంత్రి సీతక్క



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



నాగోబా జాతరలో బారులు తీరిన భక్తులు

జన జాతర

- నాగోబాకు మొక్కులు చెల్లించుకున్న ఆదివాసీలు
- ప్రజాదర్బార్‌లో సమస్యల విన్నపం

ఆదిలాబాద్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): కేస్లాపూర్ నాగోబా జాతరకు భక్తులు, ఆదివాసీలు భారీగా పోటెత్తారు. నాగోబాకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగోబా జాతరలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధ్యక్షతన ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ దర్బార్‌కు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, డీఎఫ్ఓ ప్రశాంత్‌బాజీరావ్‌పాటిల్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ తదితరులు హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి గోండు, కోలాం, ప్రధాన్, ఆంద్, నాయక్‌పోడ్, తోటి, చెంచు, మన్నెవార్, కోయ ఆదివాసీ 9 తెగల ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఆదివాసీల నుంచి శాఖల వారీగా దరఖాస్తులను స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయంబాపూరావ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయంలో చోరీ

కాగజ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఓల్డు కాలనీలోని ఉమామహేశ్వర ఆలయంలో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. ఆలయంలో ఉన్న హుండీని పగుల గొట్టి డబ్బులను అపహరించారు. కాలనీవాసులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కాగజ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం ఆలయ సమీపంలోని మూలమలుపు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. నజ్రూల్‌నగర్ క్యాంపు నుంచి కాగజ్‌నగర్‌కు బైక్‌పై వస్తున్న అభిమండల్, జిత్తు, సౌరబ్ అదుపు తప్పి కల్వర్టును ఢీ కొన్నారు. స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగజ్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అభిమండల్(16) మృతి చెందాడు.

ముగిసిన క్రికెట్ పోటీలు

బెజ్జూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సలుగుపల్లిలో నిర్వహిస్తున్న కుమరం భీం స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ప్రథమ బహుమతి సలుగుపల్లి, ద్వితీయ బహుమతి బెజ్జూరు జట్లు సాధించడంతో బహుమతులు అందజేశారు.

పులి సంచారం..

● భయాందోళనలో జనం

బెల్లంపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాలోని బె ల్లంపల్లి మండలం కన్నాల అటవీ సమీప ప్రాంతాల్లో పెద్దపులి సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కన్నాల శివా రులోని అటవీ ప్రాంతంలో ఇటీవల అటవీ శాఖ అధికారులు వన్య ప్రాణుల దాహార్తీ కోసం ఏర్పాటు చేసిన నీటికుంటలో శుక్రవారం పెద్దపులి దాహార్తీ తీర్చుకునేందుకు కుంటలో నీరు తాగింది. అనంతరం పెద్దపుల్లి అటవీ ప్రాంతం వైపు వెళ్తుండగా విధుల్లో ఉన్న ఫారెస్టు సిబ్బంది పెద్దపులిని చూసినట్లు ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ తెలిపారు. తిర్యాణి అటవీ ప్రాంతం నుంచి బెల్లంపల్లి కన్నాల బుగ్గగూడెం వైపు వచ్చిందని తెలిపారు.



నీటి కుంట వద్ద పెద్దపులి పాదముద్రలు

● అప్రమత్తమైన అధికారులు



నీటి కుంట వద్ద పెద్దపులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

పెద్దపులి సంచారంలో బెల్లంపల్లి అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. కన్నాల ప్రాంతంలోని అడవిని అనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు జాగ్రత్తలు సూచించారు. కన్నాల, బుగ్గగూడెం, పెద్దనపల్లి అటవీ రేంజ్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టారు. కన్నాల గ్రామ శివారులో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన నీటి కుంట వద్ద పెద్దపులి పాద ముద్రలను గుర్తించారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు అటవీ ప్రాంతం గుండా వెళ్లరాదని, వ్యవసాయ క్షేత్రం గుండా వెళ్లే రైతులు, గొర్రెల కాపరులు పది మందికి మించకుండా సమూహంగా వెళ్లాలని సూచించారు. పులి సంచారానికి సంబంధించి ఆనవాళ్లు కనిపిస్తేవెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పులిని హానీ చేసే విధంగా ఎలాంటి ఉచ్చులు, వలలు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేయరాదని, హానీ చేసే వ్యక్తులపై వన్య ప్రాణి చట్టం కింద కఠిన చర్యలు ఉంటాయని ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ తెలిపారు.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేట మండలంలోని బుగ్గగూడెం, పెద్దనపల్లి అటవీ శివారు ప్రాంతాల్లో పెద్దపులి సం చరిస్తున్న నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని శుక్ర వారం గ్రామాల్లో అటవీ అధికారులు చాటింపు వేయించారు. అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలందరు పత్తి చేన్లలోకి, అడవుల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని అటవీ అధికారులు సూచించారు. పులి ఆచూకీ తెలిస్తే అటవీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రత్యేక పూజలు.. శోభాయాత్ర



ఆసిఫాబాద్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాసవి మందిరంలో వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, శోభాయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు నరేష్ శర్మ, సంతోష్, ప్రసాద్, చంద్రశేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజులు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివకేశవ ఆలయ వీధి, బ్రాహ్మణవాడ, రావులవాడ, గాంధీ చౌక్ మీదుగా వాసవి మాత ఉత్సవ విగ్రహంతో భక్తి పారవశ్యంతో ఆర్యవైశ్య మహిళలు కలషాలతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో అభిషేకం, కుంకుమ పూజ, లక్ష్మిగణపతి పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిదులు శ్రీనివాస్, వెంకన్న, అవోక్, ప్రమోద్, శంకర్, మురళధర్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్, సత్యానారాయణ, శ్రీనివాస్, సంతోష్, కృష్ణ, రామన్న, శంకరయ్య, పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న వాసవి మాత ఆలయం ఆవరణలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దిరోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు చంద్రవేఖర్, శ్రీవర్ధన్, రమేష్, కిరణ్, వెంకటరమణ, గోపాల్, సంతోష్, అంజమ్మ, లీనా, గీత, జయ, రవళి, మనీషా, పావని తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దిరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రక్తనిధి భవన నిర్మాణంపై పట్టింపేది..?

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ని అక్కడికి తరలిస్తారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్ కొనసాగుతున్న జీజీహెచ్ భవనాన్ని తొలగించి, ఆ స్థానంలో ట్రామా సెంటర్ నిర్మాణం చేప ట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భవనాన్ని తొలగించనున్నందున బ్లడ్‌బ్యాంక్ ఉన్న పలంగా అక్కడి నుంచి మార్చాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కాలేజ్ రోడ్డులోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్ పక్కన గల స్థలాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఎంపిక చేశారు. అక్కడ రూ. కోటి అంచనా వ్యయంతో భవన నిర్మాణం చేపట్టనుండగా, ఆర్థిక సహాయం కోసం దాతలపై ఆధారపడక తప్పని పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వపరంగా స్థలం మంజూరు చేయకపోగా, భవన నిర్మాణం కూడా చేపట్టకపో వడంతో దాతలపైనే ఆశలు పెట్టుకున్నారు. పైగా భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం కూడా బ్లడ్‌బ్యాంక్‌కు అనువైనది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చికిత్స కోసం వచ్చే రోగులు అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడక తప్పని పరిస్థితులు ఉంటాయనే భావన సభ్యుల్లో నెలకొంది.

దాతలు సహకరించాలి...

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి



త్వరలో బ్లడ్‌బ్యాంక్‌ను తరలించాల్సి రావడంతో నూతన భవన నిర్మాణం కోసం అనువైనది కాకపోయినా కాలేజ్ రోడ్డులో స్థలం ఎంపిక చేయాల్సి వచ్చింది. అందులో నూతన భవనం నిర్మించడానికి సుమా రు కోటి రూపాయలు ఖర్చు అవుతుంది. ఆ నిధుల కోసం దాతలపై ఆధారపడక తప్పని పరిస్థితులు ఉన్నాయి. నూతన భవన నిర్మాణానికి ఫిబ్రవరి 3న భూమిపూజకు ఏర్పాట్లు చేస్తున్నాం. భవన నిర్మాణానికి ఆయ్యే ఖర్చులకు దాతలు సహకరించాలి.

తహసీల్దార్ విధులకు ఆటంకం
మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌పై కేసు

బెల్లంపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించినందుకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మత్తమారి సూరిబాబుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జనవరి 29న పట్టణంలోని రెండ వ వార్డులో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని కూల్చడానికి త హసీల్దార్ జ్యోత్స్న అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో సూరిబాబు విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించాడు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మటన్ షాపులపై దాడులు

చెన్నూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని పలు మటన్ షాపులపై మున్సిపల్, వెటరనరీ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ఏరియాలోని పలు మటన్ షాపుల్లో అభ్యమైన కుళ్లిన మాంసాన్ని వెటర్నరీ డాక్టర్ సతీష్ సీజ్ చేసి షాపు యాజమానులపై కేసు నమోదు చేశారు. అనంతరం కుళ్లిన మాంసాన్ని మున్సిపల్ వాహనంలో డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మాంసాన్ని విక్రయించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణ తెలిపారు. అలాగే వ్యాపార లైసెన్స్‌లు గడువు ముగిసిన వారు రెన్యువల్ చేసుకోవాలని, లేకుంటే నోటీసులుజారీ చేస్తామన్నారు.

ఒకే గ్రామంలో 50 మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగులు

- పోలీసులు, సింగరేణి, కార్యదర్శులు ఇలా అనేకం
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



జైపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని మిట్టపల్లి మారుమూల గ్రామం... ఇ క్కడి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇ క్కడ సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుంటుందని పెద్దలు తలిచారు. స్థానిక యువత మొక్కవోని దీక్షతో ఉజ్వల భవిష్య త్‌పై ఆశతో ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు సాగిం చారు. గ్రామంలో దాదాపు 50 మందికిపైగా వివిధ ప్ర భుత్వ ఉద్యోగాలు సాధించారు. వీరంతా సింగరేణి కార్మి కుల పిల్లలు కావడం విశేషం. పోలీసులు, సింగరేణి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ కానిస్టేబుల్, ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్ ఇలా అనేక ఉద్యోగా ల్లో రాణిస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు చిరునామాగామిట్టపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.

● అక్షరాలు నేర్పింది ఆ పాఠశాలనే...

మిట్టపల్లిలో 1994లో ప్రారంభమైన లిటిల్ స్టార్ కాన్వెంట్ (శ్రీనివాస) హైస్కూల్ ఎంతో మంది విద్యార్థులకు అక్షరాలు నేర్పింది. టేకు మట్ల గ్రామానికి చెందిన అన్నతమ్ముళ్లు సంబోదుల వెంకటస్వామి, రాంచందర్ అనే ఉపాధ్యాయులు వారికి ఏడో తరగతి వరకు బోధిం చారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వ కొలువులు సాధిం చారు. నేడు ఉన్నత స్థానానికి చేరుకున్నారు. కాలక్రమే ణా 2002లో ఈ పాఠ శాల మూతపడింది.

● సైకిళ్లపై 5 కిలోమీటర్లు వచ్చి

గ్రామంలో ఉన్నత విద్యకోసం విద్యార్థులు మండల కేంద్రానికి వచ్చేవారు. సైకిళ్లపై ఐదు కిలోమీటర్ల దూరం వచ్చి వెళ్తుండేవారు. గు రుకుల, జడ్పీ, ప్రైవేటు పాఠశాలలు, వసతి గృ హాల్లో చదువుకున్నారు. పోటీ పరీక్షల్లో సత్తా చాటి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

● పోలీస్ బ్రదర్స్...



రాజ్‌కుమార్,ఎస్ఐ



రవికుమార్, ఎస్ఐ

గోదారి అమృత-లచ్చయ్య దంపతులకు ఇద్ద రు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. లచ్చన్న సిం గరేణి ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. పెద్ద కుమారుడు రాజ్ కుమార్ 2014లో ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న తమ్ముడు రవికుమార్ పట్టుదలతో చదివి 2020లో ఎస్ఐ ఉద్యోగం సాధించా డు. రాజ్‌కుమార్ హన్మకొండలో విధులు నిర్వహి స్తుం డగా, రవికుమార్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్నాడు. ఈ బ్రదర్స్ ఇద్దరు ఒకే స్కూలులో చదివి పట్టుదలతో పోలీసు శాఖలో ఉద్యోగాలు సాధించారు.

● అన్నా చెల్లెళ్లు ఇద్దరికీ కొలువులే

ఒకే పాఠశాలలో మేము చదివాము. నేను సింగరేణిలో క్లర్కు ఉద్యోగం సాధించాను. నా చెల్లెలు శ్రీలక్ష్మీకి పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం వచ్చింది. నేను ఎస్టీపీపీలో విధులు నిర్వ హిస్తుండగా చెల్లెలు చెన్నూరు మండలంలో విధులు నిర్వహిస్తోంది. మా మిట్టపల్లి గ్రామంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.



దూట రాజమల్లు, సింగరేణి క్లర్కు



శ్రీలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి

● డిప్యూటి కలెక్టర్ కావడమే లక్ష్యం

-శ్రీరామ్ కుమార్, ఎఫ్ఆర్‌వో



వరుసగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్ బీఐలో పనిచేస్తూనే సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపిక య్యాను. ఉన్నత స్థానంలో ఉండాలని మళ్లీ చదివి అటవీ శాఖలో ఎఫ్ఆర్‌వోగా ఉద్యోగం సాధించాను. భూపాలపల్లి జిల్లా ములుగులో విధులు నిర్వహిస్తున్నాను. డిప్యూటి కలెక్టర్ కావడమే లక్ష్యంగా ఇటీవల గ్రూప్-1 పరీక్ష రాశాను.

● పట్టుదలతో చదివాను

- రామకృష్ణ, ఎస్ఐ



పోలీసు ఉద్యోగ సాధించాలని కలలు కనే వాన్ని. కష్టపడి చదివి 2019లో ఎస్ఐ ఉద్యోగం సాధించాను. ఇప్పుడు నిజామాబాద్ జిల్లా దర్పపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నాను. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

రిజిస్ట్రేషన్ కోసం నేరుగా సంప్రదించాలి

లక్షెట్టిపేట ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయికుమార్



లక్షెట్టిపేట, జనవరి, 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయేతర భూములు, వివాహ రిజిస్ట్రేషన్, బాండ్ పేపర్స్, ఈసీ, సీసీ ఏవి కావాలన్నా నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని లక్షెట్టిపేట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రర్ సాయి కుమార్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుత పరిస్థితుల్లో ఏలాంటి భూములు కొనుగోలు చేయాలి...?

ఎస్ఆర్‌వో: ప్రజలు డీటీసీ పీ లేఅవుట్ ఉన్న ప్లాట్లను మాత్రమే కొనుగోలు చేయాలి. ఎందుకంటే పూర్తిగా చట్టబద్ధమైన హక్కులు కలిగి ఉంటాయి. అలా ఉంటేనే ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: గతంలో కొన్ని నాన్ లే అవుట్ (అన్ ఆథరైజ్డ్ వెంచర్ల)లో ప్లాట్లను కోర్టు ఆర్డర్స్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. అలాంటి వాటిలో మిగిలి ఉన్న ప్లాట్ల పరిస్థితి ఏమిటి.?

ఎస్ఆర్‌వో: అలాంటివి ఏమైన ఉంటే దానికి తప్పకుండా ఎల్ఆర్ఎస్ ఉండాలి. ఎల్ఆర్ఎస్ ఉన్న వాటికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: వివాహ నమోదు ప్రక్రియ కోసం ఎలా ముందుకు సాగాలి...?

ఎస్ఆర్‌వో: ప్రజలు ఆన్‌లైన్‌లో నేరుగా ఐజీఆర్ఎస్ తెలంగాణ రిజిస్ట్రేషన్ అనే వెబ్‌సైటులో స్లాట్ బుక్ చేసుకోవాలి. తదనంతరం అన్ని పేపర్లను, సాక్షులను తీసుకుని కార్యాలయంలో సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: ఈసీ, సీసీలను ఎలా తీసుకోవచ్చు..?

ఎస్ఆర్‌వో: ప్రజలు వాళ్ల స్వంత భూముల ఈసీలు, సీసీలు కార్యాలయంలో దరకాస్తు చేసుకుని తీసుకునేందుకు అవకాశం ఉంది. మీసేవాలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించి కూడా తీసుకోవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగవు

జన్నారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జన్నారం మాజీ సర్పంచు నందునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇది హేయమైన చర్యఅన్నారు. వెంటనే అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతి, ధర్మునాయక్, శేషరావు, రవి నాయక్, బన్సీలాల్, లింబానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

బెల్లంపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి హోటల్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం యూనియన్ సభ్యులు ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా రేగుంట రాజలింగు, గౌర వాధ్యక్షులుగా రాచర్ల సంతోష్‌లను ఎన్నుకున్నట్లు హోటల్‌యూని యన్‌నాయకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. హోటల్ ఓనర్స్, వర్కర్లు ఒకే తాటిపై ఉంటూ యూనియన్ నిర్ణయించిన ధరలకే ఆహార పదార్థాలు విక్రయించాలని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న సభ్యులు



కస్తూర్బాలో ఉపాధ్యాయులతో సమావేశంలో ఎంఈవో కృష్ణమూర్తి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

భీమిని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని భీమిని ఎస్సీ కాలని, ఖర్జిభీంపూర్, కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పట్టిక ప్రకారం అందించి వంటశాలల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి రాబోయే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటు సారా అమ్మవద్దని నిరసన..

కన్నెపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండలంలోని లింగాల గ్రామంలో నాటు సారాను తయారు చేసి అమ్మవద్దని గ్రామస్తులు, మహిళలు శుక్రవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నాటుసారా తాగి యువకులు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి నాటు సారా తయారు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే మార్పు వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నాటు సారా తయారీపై ఉక్కుపాదం మోపాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు , గ్రామస్తులు

కార్యదర్శికి వినతి పత్రం అందజేత

హాజీపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని గుడిపేట గ్రామ కార్యదర్శి మల్లేష్‌కు అదే గ్రామానికి చెందిన 200 మంది ఉపాధి హామీ కూలీలు వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల కార్పోరేషన్‌లో గుడిపేట గ్రామం విలీనం అయినందున మహాత్మాగాంధీ కార్పొరేషన్‌లో సైతం ఉపాధి హామీ పథకం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్నిపై అధికారుల దృష్టికి తీసు కువెళ్తానని కార్యదర్శి తెలిపారు.

సౌర శక్తిని ఉత్పత్తి చేసి ఆదాయం పొందవచ్చు

గర్మిళ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆర్థికంగా పరిపుష్టి కావడానికి తమ బంజరు భూములు వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో సౌర శక్తిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని పొందవచ్చని మంచిర్యాల విద్యుత్ సర్కిల్ సూపరింటెం డెంట్ ఇంజనీర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అర్హత గల రైతులు, లబ్ధిదారుల నుంచి సోలార్ ప్లాంట్ పెట్టుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 6304903933, 9000550974లో సంప్రదించాలన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

వేమనపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నీల్వాయిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రోడ్డు భద్రతపై నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించి నపత్రాలను కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి వేగంగా, సెల్‌ఫోన్ నడుపుతూ వాహనాలను నడపవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి నడపాలన్నారు. విద్యార్థులు ఈ విషయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కన్నెపల్లి మండలంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటించాలని, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను పరిశీలించారు. వివిధ ధృవపత్రాల కోసం మీ సేవ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా ధృవపత్రాలు జారీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం అధికారులకు సూచించారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం చర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అదనపు గది నిర్మాణం, వంట శాల, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దళిత మహిళ ప్రభుత్వ అధికారి అయిన తహసీల్దార్‌పై దురుసుగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారిసూరిబాబు, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని 2వ వార్డులో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారనే సమాచారం మేరకు వాటిని కూల్చడానికి వెళ్లిన దళిత తహసీల్దార్ పై కాంగ్రెస్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు దురుసుగా ప్రవర్తిస్తూ తమ ది అధికార పార్టీ అని ఎలా నిర్మాణాలు కూలు స్తారని అంటూ అమర్యాదగా మాట్లాడారన్నారు. వెంటనే అతడిపై పాటు ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ఆడెపు అరుణ్, నాయకులు సబ్బని అరుణ్, ఆలీ, గోపి, సతీష్, మహేష్, చరణ్, శ్రీనివాస్, రోషన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

లక్షెట్టిపేట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ పట్టుదలతో చదవాలని మహిళ సాధికార హబ్ జండర్ విజయ అన్నారు. మండలంలోని గుల్లకోట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బేటి బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోకూడదని అది పెద్ద నేరం అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో రాణించాలని మగ వారికి సమానంగా ఉండాలన్నారు. లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోదక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, షీటీం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రజనీకాంత్, నగధర్, పవన్, తిరుపతి, లావణ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి

కాసిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం దేవాపూర్‌లో ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పోచన్న, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు, బచ్చల అంజన్న, టేకం బీంరావు, పసుపునూటి తిరుపతి, రాజన్న ఉన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

భీమారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దుకాణ దారులు షాపుల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ వేణుచందర్‌పేర్కొన్నారు. శుక్రవారం భీమారంలో దుకాణాల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే భద్రత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న పట్టణంలోని తిలక్ క్రీడా మైదానంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తిలక్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం రాజం, సభ్యులు జయరాంయాదవ్, వెంకటరాజం అన్నారు. శుక్రవారం తిలక్ క్రీడా మైదానంలో కల్యాణ మహోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. వివరాల కోసం 9550950950, 8019721128 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తాండూర్ : మండలంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా సూపర్ వైజర్ సంపత్ తనిఖీ చేశారు. అంబులెన్స్‌ల రికార్డులను పరిశీలించారు. పైలెట్ ఖలీల్, ఈఎంటీ ప్రశాంత్ పాల్గొన్నారు.

కాసిపేట : పరీక్షల్లో విద్యార్థులు ప్రశ్న పత్రంను క్షుణ్ణంగా చదివి జవాబులు రాయాలని ఎంఈవో వెంకటేశ్వర స్వామి అన్నారు. శుక్రవారం కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ తెలంగాణ ఆధ్వర్యంలో మండల స్థాయి ఫిజిక్స్ టాలెంటు టెస్టు నిర్వహించారు. హరిణి, కావ్యశ్రీ, శివానీలు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి టెస్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఫోరం నాయకులు రాజేశం, రమణా రెడ్డి, ఉపాధ్యాయులు సంతోష్, స్వర్ణ, కృష్ణగోపాల్ పాల్గొన్నారు.


దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. పోటీ పరీక్షల్లో మండలంలోని వెల్గనూర్ ఉన్నత పాఠశాలకు చెందిన అక్షణ ప్రథమ స్థానం, వైష్ణవి ద్వితీయ స్థానంలో నిలువగా గుడిరేవు పాఠశాలకు చెందిన అంజీ, లింగాపూర్‌కు మోడల్ స్కూల్‌కు చెందిన సాయి చర్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, మనోహర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అక్కెపల్లి బుగ్గరాజు(61) శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ నాయకులు సంతాపం ప్రకటించారు.

మందమర్రిటౌన్ : ప్రజాయుద్ధ నౌక గద్దర్ పద్మశ్రీ అవార్డుకు అర్హుడని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం హైద్రాబాద్‌లో గద్దర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

హాజీపూర్ : 33 ఏళ్లుగా రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణపొందిన హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఖర్షిద్ అలీ సేవలు అమోఘమని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఖుర్షీద్ అలీ పదవీ విరమణ పొందగా ఆయనను ఘనంగా సన్మానించారు.

గర్మిళ్ల : జిల్లాలో వేగంగా నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు టీఎన్‌జీవో సభ్యత్వాలను 90 శాతం పూర్తి చేసిన సందర్భంగా టీఎన్ జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరిని శుక్రవారం మంచిర్యాలలో టీఎన్‌జీవో నాయకులు ఘనంగా సన్మానించారు.



అర్ధాకలి చదువులకు స్వస్తి

- పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం
- నేటి నుంచి మార్చి 20 వరకు కొనసాగింపు
- జిల్లాలో 2,168మంది విద్యార్థులకు ఊరట
- 21 నుంచి వార్షిక పరీక్షలు

4

మిట్టపల్లి... ఉద్యోగాల కల్పవల్లి

- ఒకే గ్రామంలో 50 మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగులు
- పోలీసులు, సింగరేణి, కార్యదర్శులు ఇలా అనేకం
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం

5

రక్తనిధి భవన నిర్మాణంపై పట్టింపేది..?

- ఐదు జిల్లాల రోగులకు అందుబాటులో ఏకైక కేంద్రం
- అమలుకు నోచుకోని ఐఆర్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షుడి హామీ
- పరికరాలు ఉన్నా...సొంత భవనంలేక తప్పని ఇబ్బందులు
- ఇరుకు గదుల్లో తలసేమియా వ్యాధిగ్రస్తుల అవస్థలు
- దాతల సహకరిస్తేనే నూతన భవన నిర్మాణం..



మంచిర్యాలలోని రక్తనిధి కేంద్రం

మంచిర్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రక్తనిధి కేంద్రానికి నూతన భవన నిర్మాణ హామీ ఏళ్ల తరబడి నెరవేరకపోవడంతో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో సిబ్బంది పరంగా కొరత లేనప్పటికీ సౌకర్యాల లేమితో సికిల్ సెల్, తలసేమియా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2008లో తొలిసారిగా మంచిర్యాలకు రక్తనిధి కేంద్రం మంజూరు కాగా కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. మంచిర్యాల, కొమరంభీం ఆసిఫాబాద్, భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన రోగులు దానిపై ఆధారపడి చికిత్స పొందుతున్నారు. రోగుల సంఖ్యకు సరిపడా సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మంచిర్యాల రక్తనిధి కేంద్రంలో సుమారు 900 మంది సికిల్‌సెల్, తలసేమియా రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ సెలైన్ వాష్డ్ ఆర్బీసీ మెషీన్లు 2, లామినర్ ఎయిర్ ఫ్లో మిషన్ 1, హెచ్‌బీఏ 2 టెస్టింగ్ మెషిన్ 1, సీరం ఫెరిటిన్ టెస్టింగ్ మెషిన్ 1, సింగిల్ ప్లేట్‌లెట్ డోనర్ మిషన్ 1, రూ. 28 లక్షల విలువగల ఆటో సెంట్రి ఫ్యూజ్ పరికరం అందుబాటులో ఉన్నాయి. ఆధునిక యంత్రాలకు అనుగుణంగా 20 మందికిపైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అత్యాధునిక పరికరాలు సిబ్బంది అందుబాటులో ఉండటంతో ఇక్కడ చికిత్స పొందుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతుండగా సౌకర్యాల లేమితో వారంతా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

అమలుకాని ఐఆర్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షుడి హామీ...

మంచిర్యాల రక్తనిధి కేంద్రం నూతన భవనానికి స్థలం కేటాయిస్తే నిధులు మంజూరు చేయిస్తానన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడి హామీ అమలు కాకపోవడం వ్యాధిగ్రస్తులకు శాపంగా మారింది. ఐఆర్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో అప్పటి ప్రభుత్వ సలహాదారు బి పాపారావు 2018 ఏప్రిల్ 2న మంచిర్యాల బ్లడ్ బ్యాంకును సందర్శించారు. ఆయన వెంట అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కూడా రక్తనిధిని సందర్శించారు. ఈ సందర్భంగా మంచిర్యాల రక్తనిధి కేంద్రానికి అత్యవసరంగా నూతన భవనం ఏర్పాటు చేయాల్సి ఉందని పాపారావు అభిప్రాయపడ్డారు. బ్లడ్ బ్యాంకు సరియైన స్థలం లేక ఇరుకు గదుల్లో కొనసాగుతున్నా నిర్వహణ చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంతంలో కరీంనగర్, వరంగల్‌లోని బ్లడ్ బ్యాంకుల కన్నా మంచిర్యాల మొదటి స్థానంలో ఉందని కితాబిచ్చారు. బ్లడ్ బ్యాంకు నిర్వహణకు అన్ని వసతులున్నా మరో భవనం కేటాయించాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం తరుపున భూమి కేటాయిస్తే తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు త్వరలోనే నూతన భవనం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీపీసీ, సింగరేణితోపాటు ఇక్కడి ఎమ్మెల్యే సహకారంతో మరుసటి సంవత్సరానికి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. దాదాపు ఏడున్నరేళ్ల గడిచినా హామీ అమలు కాకపోగా కనీసం స్థలం కేటాయింపులు కూడా జరగలేదు.

స్థలం కేటాయింపులో నిర్లక్ష్యం....

రక్తనిధి కేంద్రానికి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు స్థలం కేటాయింపులో నిర్లక్ష్యం కారణంగా ఇంతకాలం అది కార్యరూపం దాల్చలేదు. దీంతో పాత భవనంలో ఇరుకు గదుల్లో చికిత్స అందించాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా జిల్లా వైద్య కళాశాలకు అనుబంధంగా మంజూరైన 350 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది. నిర్మాణం పూర్తికాగానే ఐదారు నెలల్లో..

(తరువాయి 5వ పేజీలో)

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

మందమర్రిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. శుక్రవారం శంకర్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 8లోపు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. ప్రభుత్వ పథకాలు గ్రామస్తులకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజమల్లు, కుమార్ ఉన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టును వెంటనే నిర్మించాలి

- వామపక్ష ఐక్యవేదిక నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష ఐక్యవేదిక నాయకులు

చెన్నూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రాణహిత ప్రాజెక్టును వెంటనే నిర్మించాలని వామపక్ష ఐక్యవేదిక సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాణహిత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు 2008లో అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసిందన్నారు. ప్రాణహిత నుంచి ఎల్లంపల్లి వరకు 116 కిలోమీటర్ల కోసం రూ. 1700 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. 2014లో అప్పటి సీఎం కేసీఆర్ నీరు లేదనే సాకు చూపి రీడిజైనింగ్ పేరిట మార్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి వందల కోట్ల రూపాయలను వృధా చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఫిబ్రవరి 2న మంచిర్యాలలో వామపక్ష ప్రజాస్వామిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నైనాల గోవర్ధన్, శ్రీనివాస్, చంద్రశేఖర్, లాల్‌కుమార్, గోపినాథ్, రమేష్, వెంకటేష్, సుమన్, రాజన్న, చందు, శ్యామల రాణి, రమేష్, కాంతయ్య, లక్ష్మణ్, లస్మయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఏసీపీ వెంకటేశ్వర్లు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చెన్నూరు పట్టణంలో మోటార్ సైకిల్ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వాహనాలపై చలాన్‌లు ఉంటే చెల్లించాలని, వేగంగా, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్, ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, రాజేందర్, పోలీసులు, వాహ నదారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ అధికారికి సన్మానం



స్వామిరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ మామిడి స్వామిరెడ్డి (పీఐయు) పదవీ విరమణ పొందగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. స్వామిరెడ్డిని తోటి ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్వామిరెడ్డి క్రమశిక్షణతో స్నేహ పూర్వకంగా మెలిగి అందరి మన్ననలు పొందారన్నారు. పదవీ విరమణ అనివార్యమని, ప్రతీ ఒక్కరు పదవీ విరమణ పొందుతారని, వారి జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. పలు డిపార్టుమెంట్ల అధికారులు స్వామిరెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇంజనీర్ కార్యాలయం ఈఈ, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల స్థలం కబ్జాపై ఫిర్యాదు

భీమిని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వడాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన 36 గుంటల స్థలంలో కొంత స్థలం కబ్జాకు గురైందని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవోకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుని వెంటనే భూమిని స్వాధీనం చేసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్లకు సన్మానం...



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య, ఈసంపెల్లి ప్రభాకర్

మంచిర్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవీకాలం ముగిసినందున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, చెన్నూర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు పెంట రాజయ్య, ఈసంపెల్లి ప్రభాకర్, నల్మాసు కాంతయ్య, అర్చనా రాంలాల్ గిల్డా పాల్గొన్నారు.

ఫిజిక్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

కోటపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఫిజిక్స్ టాలెంటు టెస్టు పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో కె. విష్ణు పారుపెల్లి) మొదటి స్థానంలో నిలువగా, సీహెచ్ అనూష (ఆశ్రమ పాఠశాల, కోటపల్లి), విశ్వార్చిత (జెడ్పీహెచ్ఎస్,దేవులవాడ) ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీమూర్తి తెలిపారు. వీరు మండల స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పోటీల అనంతరం విజేతలకు కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణమూర్తి, ఫిజిక్స్ ఉపాధ్యాయులు సురేందర్, చంద్రయ్య బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్, కేజీబీవీ, ఆశ్రమ, దేవులవాడ, పారుపెల్లి, నక్కలపల్లి పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలి

- గొల్ల కుర్మ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

నస్పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బీసీల హక్కుల సాధనకు, రిజర్వేషన్ల అమలుకోసం ఉద్యమించాల్సినవసరం ఉన్నదని గొల్లకుర్మ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న యాదవ్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం బీసీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2వ తేదిన వరంగల్‌లో బీసీ రాజకీయ యుద్ధభేరి తీన్‌మార్‌మల్లన్న ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. చలో వరంగల్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో బీసీలు హాజరై విజయవంతం చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల రక్షణకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. యుద్ధభేరి సభకు అన్ని కులాలకు చెందిన వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యుద్ధభేరి పోస్టర్లను విడు దల చేశారు. ఈ సమావేశంలో బీసీ జాతీయ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు పోచమల్లు, ప్రవీణ్, ఎల్లన్న, జక్కుల మల్లేష్, సమ్ము రాజన్న పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక

తాండూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఫోరమ్‌ఆఫ్ ఫిజికల్ టీచర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో మల్లేశం మండల తెలిపారు. జస్వంత్ ప్రథమ, కిరణ్ ద్వితీయ, వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్, ఫోరం నాయకులు విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదేళ్లు కాలం వెళ్లదీసిన బీఆర్ఎస్

- లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆరీఫ్

లక్సెట్టిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల ప్రజలకు లేనిపోని మాయమాటలు చెప్పి పబ్బం గడుపుతూ కాలం వెళ్లదీసి అడ్డగోలుగా సంపాదించుకున్న పార్టీ బీఆర్ఎస్ అని ఆపార్టీ నాయకులు అని లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్ మండిపడ్డారు. పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతల మాటలకు కౌంటర్ వేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఒకటి చూపి మాట్లాడాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదికే ఆరు పథకాల అమలు చేసే దిశగా ముందుకు పోతుందన్నారు. ఏకకాలంలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. ఇందిరమ్మ ఇండ్లను కూడా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందిస్తామన్నారు. ఈకార్యక్ర మంలో పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, జిల్లా నాయకుడు అశోక్, ఆర్టీఏ డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి

మంచిర్యాల క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. శుక్రవారం బేటీ బచావో-బేటీ పడావో దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని, చదువులపై ప్రత్యేక శ్రద్ధ కలిగి, ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. బాలికలు, మహిళల సంక్షేమం కోసం న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఏదైనా సలహా కోసం డీఎల్ ఎస్ఎ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్ 15100లో సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వం జిల్లా మహిళా, సంక్షేమశాఖ ద్వారా అనేక కార్యక్ర మాలు చేపడతామని, ఆపత్కర పరిస్థితిల్లో బాలికలు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త సౌజన్య, డిస్ట్రిక్ట్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మహమ్మద్ సందాని, మహిళా సాధికారత కేంద్రం, ఆర్థిక అక్షరా స్యత నిపుణురాలు లిప్సిక, పాఠశాల ప్రిన్సి పల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 2020లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 20లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని, తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. లక్సెట్టిపేట మున్సి పాలిటీలో రూ. 10లక్షలతో చేపట్టిన కంపోస్టు షెడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరా ప్రతి రోజు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణ, సరైన అనుమతులు లేని నిర్మాణాలపై నిబం దనల పరకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కూసిన ఎన్నికల కోడ్.. పార్టీ ఫ్లెక్సీల తొలగింపు



నాగసముద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

దండేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో దండేపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో ప్రధాన సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, కటౌట్లు, జెండాలు, ప్రచార పోస్టర్లను ఆయా గ్రామాలో పంచాయతీ సిబ్బంది తొలగించారు.

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేస్తున్నామని అన్ని పార్టీల రాజకీయ నాయకులు ప్రజలు తమకు సహకరించాలని తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎస్సై ఉదయ్ కిరణ్‌లు పేర్కొన్నారు.